పంట నష్టపోతే పరామర్శ కూడా కరువే

టీడీపీ హయాంలో కొండంత అండగా చంద్రబాబు

నాటి పాలనలో రైతులకు రూ.1,628 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ

వైసీపీ ఐదేళ్లలో అందించిన పరిహారం రూ.233.74 కోట్లు

సీఎం బటన్ నొక్కినా.. నేటికీ అందని ఖరీఫ్ పరిహారం

గుత్తి రూరల్ మండలంలో దిగుబడి లేని వేరుశనగ పంట




నిండా నిర్లక్ష్యం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 6: వర్షాభావం, అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల పట్ల వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. పంటనష్టం జరిగిన సమయంలో కనీసం పొలాలకు వెళ్లి పరిశీలించాలన్న ఆలోచన చేయలేదు. ఐదేళ్లలో రైతులకు భరోసానిచ్చిన దాఖలాలే లేవు. నష్టం జరిగిన ప్రతిసారీ అరకొరగా పరిహారం అందించి చేతులు దులుపుకున్నారు.



టీడీపీ హయాంలో పంటనష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకున్నారు. అప్పట్లో జిల్లా రైతాంగానికి ఏకంగా రూ.1628 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లా రైతులకు కేవలం రూ.234.74 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేశారు. పంట నష్టపోయి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమను ఆదుకోవడంలో సీఎం జగన్ విఫలమయ్యారని బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వైసీపీ అధికారం చేపట్టాక రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. సబ్సిడీ పథకాలను దూరం చేశారు. తీవ్రంగా నష్టపోయిన సందర్భాలలో చేయూత నివ్వలేదు. తీవ్ర వర్షాభావం, అకాల వర్షాలు రైతుల జీవితాలను అతలాకుతలం చేసినా.. ప్రభుత్వం బాధితులకు భరోసా కల్పించలేదు. అరకొర పెట్టుబడి సాయం మినహా.. తమకు ఒరిగింది లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపోయిన సందర్భాలలో టీడీపీ ప్రభుత్వం తమను ఆదుకుని అండగా నిలిచిందని, వైసీపీ అధికారంలోకి వచ్చాక తమ కష్టాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని అన్నదాతలు మండిపడుతున్నారు.



రైతుల గోడు పట్టని వైసీపీ ప్రభుత్వం



టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లా రైతులకు అందిన పరిహారం వివరాలు		
సంవత్సరం	రైతుల సంఖ్య	ఇన్‌పుట్ సబ్సిడీ (కోట్లలో)
2014 (కరువు)	5,79,640	రూ.567.32
2015 (అకాల వర్షం)	932	రూ.19 లక్షలు
2016 (అకాల వర్షం)	173	రూ.11 లక్షలు
2016 (కరువు)	6,25,050	రూ.1032.42
2017 (అకాల వర్షం)	5,828	రూ.7.23
2017 (రబీలో కరువు)	1,154	రూ.20.78
మొత్తం	12,12,777	రూ.1,628.05

బటన్ నొక్కినా..

ఏ సీజన్‌లో పంటనష్టం జరిగితే ఆ సీజ్ ముగిసిన వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకుంటామని సీఎం జగన్ పలుమార్లు ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఆచరణలో ఘోరంగా విఫలమయ్యారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగలోగా ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం అప్పట్లో ప్రకటించింది. కానీ సొమ్ము విడుదల చేయలేదు. తీరా ఎన్నికల కోడ్ వచ్చే ముందు, మార్చి 6వ తేదీన 2023-24 ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి పరిహారం ప్రకటించారు. జిల్లాలోని 28 మండలాల్లో 1.69 లక్షల మంది రైతులకు రూ.251.2 కోట్ల పరిహారాన్ని విడుదల చేస్తున్నామని ప్రకటించారు. తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్ ఆ రోజు బటన్ నొక్కినా.. ఇప్పటి దాకా ఒక్క రైతు ఖాతాలోనూ ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము జమ కాలేదు. ఎన్నికల సమయంలో రైతులను మభ్యపెట్టేందుకే జగన్ బటన్ నొక్కారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వెంటాడిన వర్షాభావం

2023 ఖరీఫ్ సీజన్‌ను వర్షాభావం వెంటాడింది. వేరుశనగ, ఆముదం, పత్తి, కంది, జొన్న తదితర పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. వేరుశనగ పంట ఊడదశలో చుక్క వర్షం కురవలేదు. ఆ సమయంలో భూమిలో తగినంత తేమ ఉండాలి. అప్పుడే ఊడలు భూమిలోకి దిగి, పిందెలు ఏర్పడుతాయి. కానీ వానలేక పంట దెబ్బతింది. కొన్నిచోట్ల చెట్టుకు రెండు, మూడు కాయలు మాత్రమే కాశాయి. మరికొన్నిచోట్ల కాయల ఆనవాళ్లే లేకుండాపోయాయి. చాలా పంటలు పొలాల్లోనే ఎండిపోయాయి. ఆ పరిస్థితి చూడలేక రైతులు పంటలను దున్నేశారు. పెట్టుబడులను కోల్పోయి.. అప్పుల ఊబిలో మరింత కూరుకుపోయారు.

దెబ్బతిన్న ఉద్యాన పంటలు

2022 ఆగస్టులో అకాల వర్షాలకు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 823.46 హెక్టార్లల్లో రూ.5.95 కోట్లకుపైగా విలువైన అరటి, బీన్స్, అనప, చీనీ, కర్బూజ, కళింగర, జామ, మిరప, ఉల్లి, దానిమ్మ, బొప్పాయి, టమోటా తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. డి.హిరేహాళ్, రాయదుర్గం, ఉరవకొండ, గార్లదిన్నె, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, కూడేరు, పామిడి, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, గుంతకల్లు మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాకు మంజూరైన ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలు		
సంవత్సరం	రైతుల సంఖ్య	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.కోట్లల్లో)
2019-20	3,807	5.19
2020-21	12,406	15.08
2021-22	72,693	85.73
2022-23	3,580	5.01
2023-24	2,834	2.65
మొత్తం	95,320	113.66

డబ్బులు పడలేదు..



ఖరీఫ్‌లో 2.30 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. వర్షాలు పడకపోవడంతో పంట దిగుబడి భారీగా తగ్గిపోయింది. తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించడంతో అంతో ఇంతో ఆసరా అవుతుందని భావించాము. కానీ సీఎం జగన్ బటన్ నొక్కి రోజులు గడుస్తున్నా ఇప్పటికీ నా ఖాతాలో డబ్బులు జమకాలేదు.

- మీనాక్షమ్మ, మోపిడి, ఉరవకొండ మండలం

రైతులకు తీరని అన్యాయం



వైసీపీ అధికారంలోకి వచ్చాక రైతులకు తీరని అన్యాయం చేశారు. పంటనష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ ఐదేళ్లలో ఇన్‌పుట్ సబ్సిడీ అరకొరగా అందించి చేతులు దులుపుకున్నారు. 2023-24 ఖరీఫ్ ఇన్‌పుట్ సబ్సిడీని ముందుగా ఇవ్వకుండా జాప్యం చేశారు. తీరా ఎన్నికల కోడ్ వచ్చే ముందు హడావుడిగా సీఎం జగన్ బటన్ నొక్కారు. ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసినట్లు గొప్పలు పోయారు. అయినా ఇప్పటి దాకా ఏ ఒక్క రైతుకూ ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదు.

- విరూపాక్షి, గూళ్యపాల్యం, వజ్రకరూరు మండలం



రాప్తాడు మండలం రామినేపల్లి, హంపాపురం వద్ద ఎండిన వేరుశనగ(ఫైల్)



రాప్తాడులో కాయల్లేని వేరుశనగ (ఫైల్)




అకాల వర్షానికి దెబ్బతిన్న అరటి పంట (ఫైల్)

లీకేజీపై పోలీసుల

దర్యాప్తు

ఇద్దరు టీచర్ల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ..?

అనంతపురం టౌన్, ఏప్రిల్ 6: ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది జాబితా బయటకు రావడాన్ని జిల్లా ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలకు వ్యక్తిగతంగానే ఎన్నికల విధులకు సంబంధించిన ఉత్తర్వులు అందుతాయి. ఎంపికైన వారికి నియోజకవర్గ స్థాయిలో ఒకసారి శిక్షణ ఇస్తారు. ఆ తరువాతనే వారికి పీఓ, ఏపీఓ, ఓపీఓ విధులను కేటాయిస్తారు. ఎక్కడికి వెళ్లాలనేదీ అప్పుడు చెబుతారు. కానీ టీచర్ల వాట్సాప్ గ్రూపులలో చక్కర్లు కొట్టిన జాబితాలో పూర్తిస్థాయి వివరాలు ఉండటం కలకలం రేపింది. దీంతో జేసీ కేతన్‌గార్గ్ సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్‌ఐసీ, విద్యావాఖ అధికారులు, ఎలెక్షన్ సెల్‌లో పనిచేసిన ఉపాధ్యాయులను పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీకి ఫిర్యాదు చేయించారు. అధికార పార్టీకి మేలు చేసేందుకే సిబ్బంది జాబితాను బయట పెట్టారన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ స్థాయి అధికారి రంగంలోకి దిగారు. జాబితా బయటకు ఎలా వచ్చిందో తేల్చేందుకు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. జాబితా తయారీలో కీలకంగా పనిచేసిన సిబ్బందిని పిలిపించి ప్రశ్నించినట్లు తెలిసింది. లీకేజీ వెనుక ఇద్దరు టీచర్లు ప్రమేయం ఉందని నిర్ధారణ అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీనివెనుక ఉన్న అధికార పార్టీ అనుకూల ఉపాధ్యాయ సంఘం నాయకులు రంగంలోకి దిగి.. ఆ ఇద్దరిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీ నాయకుల ద్వారా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని తెలిసింది. వారిని తప్పించేందుకు పోలీసు, విద్యాశాఖ అధికారులు సహకారం అందిస్తున్నారని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



ఇఫ్తార్	ఆదివారం సాయంత్రం	06:34
సెహరీ	సోమవారం ఉదయం	04:53

ఉష్ణోగ్రతలు (శని)

గరిష్ఠం : 43.0

కనిష్ఠం : 28.0



కోడ్ అమలులో

రాజీ వద్దు

ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి

జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 6: ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని అధికారులకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాతో వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం ఆయన ఆర్వోలు, ఏఆర్వోలు, తహసీల్దారు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు విషయంలో ఎక్కడా రాజీ పడరాదని అన్నారు. కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోడ్ ఉల్లంఘనలపై రోజువారీ నివేదిక పంపాలని సూచించారు. కోడ్ ఉల్లంఘించిన కారణంగా ఇప్పటివరకు 52 మంది వలంటీర్లు, 15 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి, ఇద్దరు వలంటీర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయించామని తెలిపారు. ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేశామని తెలిపారు. జిల్లాలో 2,236 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో 1,032 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని తెలిపారు. ఈ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. అక్రమ మద్యం, నగదును సీజ్ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ జిల్లాలో రూ1.93 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని అన్నారు. సమీక్షలో ఆర్వోలు వెంకటేష్, రాణి సుష్మిత, కరుణకుమారి, శ్రీనివాసులురెడ్డి, వసంతబాబు, రాంభూపాల్‌రెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు .

చేరాలి

మళ్లీ మళ్లీ..!

మనిషన్నాక కళా పోషణ ఉండాల..! అట్లనే ఎన్నికలు అన్నాక హడావుడి ఉండాల..! అందుకే '..జరగాలి మళ్లీ మళ్లీ పెళ్లి..' అని అదేదో సినిమాలో అన్నట్లు.. వైసీపీ నాయకులు పార్టీలో ఉన్నవారినే మళ్లీ పార్టీలో చేర్చుకుంటూ.. సీన్ క్రియేట్ చేస్తున్నారు. అది చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో వైసీపీ కండువాలు కప్పే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఎవరైనా చూస్తే.. 'భారీగా చేరికలు' అనుకుంటారు. కాస్త లోతుగా వెళితే.. అంతా మాయ అని తెలుస్తుంది. యాడికిలోని కుంటవీధికి చెందిన మహబూబ్‌బాషా రెండేళ్లక్రితం వైసీపీ కండువా కప్పుకుని.. పార్టీ కార్యక్రమాలలో పాల్గొన్నాడు. ఆయనే తిరిగి వైసీపీలో చేరారు. వైసీపీ అభ్యర్థి పెద్దారెడ్డి ఆయనకు కండువా కప్పి.. ఉన్నపార్టీలోకే మళ్లీ ఆహ్వానించారు. - యాడికి





వైసీపీ అభ్యర్థి ఆధ్వర్యంలో శనివారం..

రెండేళ్ల క్రితం

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, ఏప్రిల్ 6: మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళ తాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఎవరెవరు

వెళ్లారు..?

'మాస్టారూ.. డిన్నర్'పై నివేదిక కోరిన కలెక్టర్

విచారణ ప్రారంభించిన డీఈఓ, ఎస్ఎస్ఏ ఏపీసీ

అనంతపురం విద్య, ఏప్రిల్ 6: మాస్టార్లకు వైసీపీ ఇచ్చిన రాజకీయ విందు కాకరేపుతోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా జరిగిన ఈ విందు గురించి ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన 'మాస్టారూ.. డిన్నర్' కథనం ఉపాధ్యాయ, విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం గురించి విచారించి, నివేదిక ఇవ్వాలని ఎలెక్షన్ సెల్ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో డీఈఓ వరలక్ష్మి విచారణకు దిగారు. రాజకీయ విందులో కీలకంగా వ్యవహరించినవారు ఎవరు, ఉపాధ్యాయులు, సమగ్రశిక్ష ఉద్యోగులు ఎవరెవరు వెళ్లారు అని ఆరా తీశారు. సమగ్రశిక్ష ఉద్యోగులపై నివేదిక ఇవ్వాలని ఏపీసీ వరప్రసాద్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులను పిలిచి విచారించినట్లు సమాచారం. విందుకు తాము వెళ్లలేదని వారిద్దరూ లిఖితపూర్వకంగా చెప్పినట్లు తెలిసింది. వైసీపీకి అనుబంధంగా ఉండే ఉపాధ్యాయ సంఘం, మరో సంఘం నాయకులు పనిచేసే మండలాల ఎంఈఓలను కూడా నివేదిక ఇవ్వాలని డీఈఓ కార్యాలయ అధికారులు కోరినట్లు తెలిసింది. అనంతపురం రూరల్, గార్లదిన్నె మండలాల్లో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మరో సంఘం నాయకుడు కూడా తాము ఆ డిన్నర్‌కు వెళ్లలేదని వివరణ రాసిచ్చినట్లు తెలుస్తోంది. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సైతం విచారణ ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష ఏపీసీ, ఎంఈఓలు, ఇతర వర్గాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా నివేదిక తయారు చేసి, అనంతపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపినట్లు తెలుస్తోంది.



అందరిలో గుబులు

నగర శివారులోని ఓ డాబాలో గత ఆదివారం ఏర్పాటు చేసిన డిన్నర్‌కు వందల సంఖ్యలో ఉపాధ్యాయులు వెళ్లారు. అధికార పార్టీ మత్తులో ఉన్న నాయకులకు, టీచర్లకు ఎన్నికల కోడ్ ఉందన్న స్పృహ కూడా లేదన్న విమర్శలు వచ్చాయి. విందు రాజకీయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు కూపీ లాగుతున్నారు. దీంతో విందులో పాల్గొన్న టీచర్ల గుండెల్లో గుబులు మొదలైంది. అనవసరంగా రాజకీయ విందుకు వెళ్లామని ఇప్పుడు నిట్టూరుస్తున్నారట. మరికొందరు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారట. చాలామంది తాము ఆ దరిదాపుల్లోకి కూడా వెళ్లలేదని బుకాయిస్తున్నారు. అధికారులు అడగటంతో వివరణ రాసిస్తున్నారు. పోలీసు శాఖ తలచుకుంటే విందులో పాల్గొన్న వారి వివరాలను తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ పట్టేస్తే విందులో పాల్గొన్నవారి గుట్టు రట్టు అవుతుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారో.. లేదో వేచి చూడాల్సిందే.

వైసీపీ సీఐ..!

అధికార పార్టీకి వీర విధేయుడు

- ఆరేళ్లుగా నగర పరిధిలోనే విధులు
- ప్రత్యేక విభాగంలో ఉంటూ.. చక్రం
- పోలీస్ బాస్‌ద్వారా కిందిస్థాయిలో పెత్తనం



అనంతపురం క్రైం, ఏప్రిల్ 6: జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వైసీపీకి వీర విధేయత చూపుతున్నారు. ఇన్నాళ్లు వైసీపీ నేతల సిఫార్సులతో తనకు నచ్చిన పోలీస్‌స్టేషన్‌లలో పనిచేశారు. ఇప్పుడు ఓ ప్రత్యేక విభాగంలో పనిచేస్తున్న ఈ సారు.. అధికార పార్టీకి మేలు చేయడానికి కంకణం కట్టుకున్నారు. కొన్ని నెలలుగా ఆయన చేసిన వ్యవహారాలను పరిశీలిస్తే.. వైసీపీకి ఎంతఅనుకూలంగా అర్థమవుతుంది. పోలీసు శాఖలో కొందరి బదిలీల విషయంలో ఆయనపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. నిన్నమొన్నటిదాకా పనిచేసిన జిల్లా పోలీస్ బాస్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే విమర్శలొచ్చాయి. ఎక్కువ సమయం ఆ ఉన్నతాధికారి పక్కనే ఉంటూ.. తానూ వైసీపీకి వీర భక్తున్ననే నమ్మకాన్ని కలిగించారు. దీంతో ఈ చిన్న సారు చెప్పింది ఆ పెద్ద సారు విని.. ఆచరించారని సమాచారం. జిల్లా పోలీసు శాఖలో కిందిస్థాయి నుంచి ఏఎస్‌ఐ వరకు, కొన్ని సందర్భాల్లో ఎస్‌ఐ స్థాయి వరకు బదిలీల్లో ఈ సీఐ సార్ జోక్యం చేసుకునే వారని సమాచారం. 'జిల్లా పోలీస్ బాస్ వెళ్లిపోయారు.. ఇక ఈ సార్‌ను ఎప్పుడు పంపుతార్రా బాబూ' అంటూ ఆ శాఖలో కొందరు తమలో తాము మదనపడిపోతున్నారు. 'ఈ సీఐకి ఎన్నికల నిబంధనలు వర్తించవా?' అని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. జిల్లా పోలీస్ శాఖలో ఆయన మాటే శాసనంగా మారిందని అంటున్నారు.

ఓ సామాజికవర్గమే టార్గెట్..?

ఎన్నికలు సమీపించినప్పటి నుంచి జిల్లాలో పోలీసు శాఖలో ఒకింత మార్పు వచ్చింది. వైసీపీ గెలుపే ధ్యేయంగా ఓ బిగ్ బాస్, మరో చిన్నబాస్ పనిచేయడం మొదలుపెట్టారు. టీడీపీకి అనుకూలంగా ఉన్నారంటూ కొందరిపై కన్నేశారు. వారందరూ వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా లేరని భావించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఓ కీలక సామాజికవర్గం పోలీసు సిబ్బందిని టార్గెట్ చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. వారందరినీ శాంతి భద్రతల విభాగం తప్పించారు. పోలీస్‌స్టేషన్లలో లేకుండా చెక్‌పోస్టులకు, ఇతర ప్రాంతాలకు పంపించేశారు. ఇవేమీ బదిలీలు కావని ఎన్నికల విధులంటూ వారికి చెప్పి పంపారట. కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ హోదా వరకు అలా వెళ్లినవారిలో ఉన్నారని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఒక్కో పోలీస్‌స్టేషన్ నుంచి ఇద్దరు ముగ్గురు చొప్పున సుమారు వంద మంది సిబ్బందిని వేర్వేరు ప్రాంతాలకు పంపినట్లు సమాచారం. దీని వెనుక చిన్న బాస్ సూచనలు ఉన్నాయని, అందుకే పెద్ద బాస్ అమలు చేశారని అంటున్నారు.

ఆరేళ్లుగా అనంతలోనే..

పోలీస్ శాఖలో పెత్తనం చెలాయిస్తున్న సీఐ సారు.. కొన్నేళ్ల నుంచి జిల్లా కేంద్రంలోనే చక్కర్లు కొడుతున్నారు. అధికారంలో ఉన్న వైసీపీ నేతల సిఫార్సులతో నగరంలోని పోలీస్‌స్టేషన్లలోనే పని చేస్తున్నారు. తొలుత టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేశారు. రెండేళ్ల తరువాత బదిలీ రావడంతో ఓ నేతను ప్రసన్నం చేసుకున్నారు. పక్కనే ఉన్న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఎన్నికలకు ముందు పక్కకు పెడతారని భావించినా, ఆయన ఎక్కడికీ వెళ్లలేదు. పోలీస్ శాఖలో ప్రత్యేక విభాగానికి వచ్చారు. పోలీస్ బాస్‌కు సన్నిహితంగా మారి, వైసీపీ వారికి అనుకూలంగా వ్యవహరించారు. ఈయన కారణంగా పోలీసు శాఖలో సిబ్బంది మధ్య తరచూ విభేదాలు తలెత్తుతున్నాయని సమాచారం. పోలీసు అధికారులు ఒకే సబ్ డివిజన్‌లో, లా అండ్ ఆర్డర్‌లో మూడేళ్లకు మించి ఉండకూడదు. కానీ ఈయన ఆరేళ్లకుపైగా నగరంలోనే ఉంటున్నారు.

ఇదిగో నజరానా..!

ఎన్నికల్లో కష్టపడి పనిచేయండి

గెలిచాక ఇంకా చాలా ఉంటాయి..

సొంత సైన్యానికి వైసీపీ తాయిలాలు



బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 6: పార్టీ కోసం కష్టపని పనిచేసినా.. ఇన్నాళ్లు పట్టించుకోలేదు. ఎన్నికల సమయం కావడంతో వాడుకునేందుకు వల విసిరారు. సొంత సైన్యానికి నజరానాలు ఇస్తున్నారు. శింగనమల నియోజవకర్గంలో ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. సామాజిక మాధ్యమాలలో లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్లు ప్రచారం చేయాలని పురమాయిస్తున్నారు. నియోజకవర్గంలో వంద మందికి పైగా సోషల్ మీడియా కో ఆర్డినేటర్లకు తాజాగా నగదు నజరానా ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవలే నియోజకవర్గంలోని ఆరు మండలాల సోషల్ మీడియా కో ఆర్డినేటర్లను బుక్కరాయ సముద్రం మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలకు పిలిపించారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. విందు భోజనం పెట్టి.. ఒకొక్కరికి రూ.15 వేల వరకు నగదు నజరానా ఇచ్చినట్లు సమాచారం. ఎన్నికలలో చురుగ్గా పనిచేయాలని, ఈ సారి అధికారంలోకి వస్తే ప్రత్యేక గుర్తింపు ఇస్తామని, ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. వైసీపీ కార్యక్రమాలను సోషల్ మీడియాలో హైలైట్ చేయాలని, టీడీపీని దెబ్బతీసేవిధంగా వీడియోలు సృష్టించాలని దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. విజయవాడ నుంచి వచ్చిన ఓ ప్రత్యేక బృందం వీరికి శిక్షణ ఇచ్చినట్లు తెలిసింది. అసంతృప్తిగా ఉన్న బూత్ కన్వీనర్లను కూడా బుజ్జగించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. వారికి కూడా నగదు నజరానా ఇచ్చినట్లు తెలిసింది. ఎన్నికలు ముగిసేదాకా.. ఈ 40 రోజులు గ్రామాల్లో ఉండి చురుగ్గా పనిచేయాలని వీరికి సూచించారని తెలిసింది. త్వరలోనే నియోజకవర్గంలోని గ్రామ వలంటీర్లతో మండలాలవారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఒకొక్కరికి రూ.10 వేలు చొప్పున ఇచ్చేందుకు వైసీపీ నేతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికలలో కష్టపడి పనిచేసిన వారిని తిరిగి గ్రామ వలంటీర్లుగా కొనసాగిస్తామని, ఇంటి స్థలాల పట్టాలు, సంక్షేమ పథకాలను అందిస్తామని వలంటీర్లను ప్రలోభ పెడుతున్నారని తెలిసింది.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

వైసీపీకి ఎంపీపీ రాజీనామా

ముదిగుబ్బ, ఏప్రిల్ 6: వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ బీసీ నేత ప్రస్తుత ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణయాదవ్ వైసీపీకి గుడ్‌బై చెప్పారు. బి.కొట్టాల గ్రామంలోని ఎంపీపీ నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేశానని, కానీ కొందరు దుష్టశక్తుల కారణంగా పార్టీని వీడుతున్నానన్నారు. రైతు కుటుంబం నుంచి ప్రజాసేవే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చానన్నారు. బీసీ నేతలు ఎదుగుదల ఓర్వలేకనే పార్టీలో కొందరు అణగదొక్కుతున్నారన్నారు. ఏ త్వరలోనే తన సన్నిహితులతో చర్చించి భవిష్యత్తు ప్రణాళిక ప్రకటిస్తానన్నారు. ముదిగుబ్బ మండలం మలకవేముల ఎంపీటీసీ మంజునాథ్, నాగులగుబ్బల వైసీపీ నాయకుడు అమీర్ రాజీనామా చేయనున్నట్లు తెలిపారు.

తనకల్లు మార్కెట్‌యార్డు చైర్మన్ ..



ఈశ్వర్‌రెడ్డి

తనకల్లు, ఏప్రిల్ 6: మండలంలోని చీకటిమానుపల్లికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, తనకల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి శనివారం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ సభ్యత్వానికి , అలాగే మార్కెట్‌యార్డు చైర్మన్ పదవికికూడా రాజీనామా చేశారు. అనంతరం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో ఘోరంగా విఫలమైందన్నారు. పార్టీలో వివక్షను తట్టుకోలేక రాజీనామా చేస్తున్నానన్నారు. రాజీనామా పత్రాన్ని మార్కెట్‌యార్డు కమిషనర్‌కు పంపినట్లు తెలిపారు. త్వరలోనే టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కదిరి ప్రాంతంలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని, అవి పరిష్కారం కావాలంటే టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌తోనే సాధ్యమన్నారు. ఆయన విజయం కోసం తనవంతుగా కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం తనతో పాటు కొక్కంటికి చెందిన పాళ్లేగాళ్ల వైవీ దినకర్‌ప్రసాద్‌నాయక్, చీకటిమానుపల్లి సర్పంచ్, ఎంపీటీసీ, మండలంలోని పలువురు వైసీపీ నాయకులు కందికుంట సమక్షంలో టీడీపీలోకి చేరనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్రీడల్..!



- కేవీకేల నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఐదేళ్లలో ఒక్క స్టేడియమూ నిర్మించలేదు
- జిల్లాకు మంజూరైనవీ వెనక్కు...కలగానే స్టేడియం
- నిరాశలో క్రీడాకారులు, అభిమానులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 6: వైసీపీ ప్రభుత్వంలో క్రీడాశాఖ నిర్లక్ష్యానికి గురయ్యింది. జిల్లాకు మంజూరైన క్రీడా వికాస కేంద్రాలనూ (స్టేడియాలు) రద్దు చేశారు. జిల్లాకు టీడీపీ ప్రభుత్వం కేటాయించిన ఐదు కేవీకేలు వెనక్కు వెళ్లాయి. ప్రతి నియోజకవర్గానికి ఓ స్టేడియం నిర్మించి ప్రజలకు వాకింగ్, జిమ్‌తో పాటు క్రీడాకారులకు అనువుగా క్రీడాసాధన చేయడానికి అన్ని సదుపాయాలు కల్పించాలని మొదట ప్రభుత్వం భావించినా అమలు చేయడంలో విఫలమయ్యారు. గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు 19స్టేడియాలు మంజూరు చేస్తూ రూ.38కోట్ల నిధులు సైతం మంజూరు చేసింది. నాలుగు స్టేడియాలను నిర్మించి క్రీడాకారులకు అందుబాటులో ఉంచింది. అయితే మిగిలిన వాటిని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వాటి నిర్మాణాలను పూర్తిగా నిలిపివేశారు. దీనిపై క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు లేకపోవడంతో సాధన, శిక్షణ సంపూర్ణంగా చేయలేకపోతున్నామని క్రీడాకారులు వాపోతున్నారు. అసలే జిల్లాకు స్టేడియాలు మంజూరు చేయడం లేదని, గత ప్రభుత్వం మంజూరు చేసిన స్టేడియాలను రద్దు చేయడం క్రీడాలోకానికి తీరని నష్టం కలిగిస్తోందని క్రీడాకారులు వాపోతున్నారు.



కనీస వసతులు లేని రామగిరిలోని క్రీడా వికాసకేంద్రం

జిల్లాకు 19స్టేడియాలు మంజూరు చేసిన టీడీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు 19స్టేడియాలు మంజూరు చేసింది. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి నార్పల, కళ్యాణదుర్గం, రామగిరి ప్రాంతాల్లోని క్రీడా వికాస కేంద్రాల నిర్మాణం గత ప్రభుత్వమే పూర్తి చేసింది. రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ, కల్లూరు ప్రాంతాల్లోని స్టేడియాలకు ఐదేళ్ళుగా ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ఇక ఆత్మకూరు, అనంతపురం, శింగనమల ప్రాంతాలకు మంజూరు చేసిన కేవికేలను రద్దు చేశారు. ఒక్కో స్టేడియానికి రూ.2కోట్ల చొప్పున గత ప్రభుత్వం నిధులు సైతం కేటాయించింది. అయితే కొన్నింటిని రద్దు చేయడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.



నిర్మాణ దశలోనే కల్లూరు కేవీకే స్టేడియం నిర్మాణం

మంజూరు అయినవి వెనక్కు..

జిల్లాకు గత ప్రభుత్వం మంజూరు చేసిన స్టేడియాలను రద్దు చేశారు. వీటిలో అనంతపురం అర్బన్, శింగనమల, రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు ఉన్నాయి. స్టేడియాల రద్దు కావడంతో నిధులు వెనక్కు వెళ్ళిపోయాయి. అసలే జిల్లాలో క్రీడా వసతులు లేవని క్రీడాకారులు ఆందోళన చెందుతున్న క్రమంలో ఇలా మంజూరైన స్టేడియాలను రివర్స్‌లో రద్దు చేయడం గమనార్హం.

అనంతకు స్టేడియం లేనట్లేనా..?

ఎన్నో ఏళ్ళుగా జిల్లా కేంద్రంలో స్టేడియం నిర్మాణం చేపట్టాలన్న కల నెరవేరనేలేదు. గత ప్రభుత్వం అనంతపూరం జిల్లా కేంద్రానికి స్టేడియం మంజూరు చేసింది. అయితే స్టేడియం నిర్మాణానికి స్థలం లేదనే కారణంతో మంజూరైన కేవికే వెనక్కు వెళ్ళింది. దీంతో ఏళ్ళుగా ఎదురు చూస్తున్న క్రీడాకారుల కల, ఆశలపై నీళ్ళు చల్లారు. పెరుగుతున్న నగర జనాభా, క్రీడాకారులకు ఆధునిక సదుపాయాల కల్పన ఏర్పాటు లక్ష్యంతో జిల్లా కేంద్రంలో ఓ భారీ స్టేడి యం నిర్మించాలని గత ప్రభుత్వం భావించినా ఆచరణలోకి తీసుకురావడంలో నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారు.



అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియం

కేవీకేల నిర్మాణం ఆగిన మాట వాస్తవమే

: షఫీ, డీఎస్‌డీఓ చీఫ్‌కోచ్



జిల్లాకు కేటాయించి మంజూరు చేసిన కీడావికాస కేంద్రాలు నిర్మాణాలు ప్రస్తుతానికి నిలిచిపోయాయి. నిధుల కొరత, స్థల లభ్యతలో ఇబ్బందులు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని స్టేడియాలను ప్రస్తుతానికి నిలిపివేశారు. ఇందులో అనంతపురం, శింగనమల, ఆత్మకూరు పాంతాలకు మంజూరైన స్టేడియాలను రద్దు చేశారు. తదుపరి పూర్తి వివరాలు శాప్ నుంచి రావాల్సి ఉంది.

భర్త ప్రవర్తన మార్చుకోలేదని భార్య ఆత్మహత్య



ఉషారాణి (ఫైల్)

యాడికి, ఏప్రిల్6: మద్యానికి బానిసైన భర్త ప్రవర్తన మార్చుకోలేదని భార్య ఉషారాణి (28) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సంఘటన శుక్రవారం రాత్రి యాడికి మండలం తూట్రాళ్లపల్లిలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. నంద్యాలజిల్లా డోన్ మండలం గుమ్మకొండ గ్రామానికి చెందిన ఉషారాణిని యాడికి మండలం తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన గోపినాథ్‌గౌడ్‌కు ఇచ్చి 8సంవత్సరాల క్రితం వివాహం చేశారు. గోపినాథ్‌గౌడ్ స్థానికంగా సోలార్‌ప్లాంట్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేసేవాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు హర్షవర్ధిని, తేజశ్వినిలు ఉన్నారు. గోపినాథ్‌గౌడ్ మద్యానికి బానిసై డ్యూటీకి వెళ్లేవాడు కాదు. దీనిపై భార్యభర్తలు గొడవ పడ్డారు. మనస్తాపంతో ఉషారాణి విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఉషారాణి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు విచారణ చేపట్టారు.

ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 6: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడపలో ఉచిత శిక్షణ, ఉద్యోగం కల్పిస్తామని ఆ సంస్థ కోఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం ప్రకటించారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. 35రోజుల పాటు కడపలో ఉచిత శిక్షణ, భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో ఉత్తమ శిక్షణ ఇస్తామన్నారు. 90004 87423 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

15న మహిళలకు ఉద్యోగమేళా

మహిళా నిరుద్యోగులకు ఈనెల 15న ఉద్యోగమేళా నిర్వహించనున్నారు. కళ్యాణదుర్గంలోని పాత ఆర్డీటీ ఆసుపత్రిలో ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి శనివారం తెలిపారు. కోలార్‌లోని నర్సాపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ప్రొడక్షన్ మేనేజర్, టెక్నికల్ ఆపరేటర్‌గా పనిచేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి, డిగ్రీ, ఇంటర్, డిప్లమా చదివి 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు అర్హులన్నారు. వివరాలకు సెల్ నంబరు 9513822234ను సంప్రదించాలని కోరారు.

తీరు మారని వలంటీర్లు

ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా కొందరు వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగుల్లో మార్పు రావడం లేదు. అధికారులు మాత్రం వారి గురించి విచారించి వేటు వేస్తూనే ఉన్నారు.



వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్ బయపురెడ్డి

అనంతపురం, ఏప్రిల్ 6 : ఎన్నికల కమిషన్ హెచ్చరిస్తున్నా కొందరు ఉద్యోగుల్లో మార్పు రావడం లేదు. అనంతపురం జిల్లా కూడేరు మండలం ముద్దలాపురం గ్రామంలో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో మరుట్ల ఫీల్డ్ అసిస్టెంట్ బయపురెడ్డి పాల్గొన్నారు. శనివారం ముద్దలాపుం గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారానికి ఉరవకొండ వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వర రెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకర్ నారాయణ హాజరైన ప్రచారంలో మరుట్ల ఫీల్డ్ అసిస్టెంట్ హాజరైయ్యారు.

బొమ్మేపర్తి ఫీల్డ్ అసిస్టెంట్..



ఎమ్మెల్యే పక్కన రమణారెడ్డి

రాప్తాడు : ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురువారం అయ్యవారిపల్లి, ప్రసన్నాయపల్లి, చిన్మయ్‌నగర్, ఇందిరమ్మ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. అయ్యవారిపల్లి గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో బొమ్మేపర్తి ఫీల్డ్ అసిస్టెంట్ రమణారెడ్డి ఎమ్మెల్యేతో ప్రచారం చేశాడు.

ఆర్టీసీ కండక్టర్ సస్పెన్షన్

ధర్మవరంరూరల్, : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆర్టీసీ కండక్టర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో ఈనెల 4వతేదిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వెంట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో అదే గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ వెంకటరమణారెడ్డి, వలంటీర్ జూటూరు కవితలు పాల్గొన్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. కండక్టర్ వెంకటరమణారెడ్డిని సస్పెండ్ చేసినట్లు ధర్మవరం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణరావు తెలిపారు. ఆ గ్రామ వలంటీర్ జూటూ రు కవితను కూడా విధులు నుంచి తప్పించినట్లు ఎంపీడీఓ మమతాదేవి తెలిపారు.

ఓటర్ వెరిఫికేషన్‌లో వలంటీర్

కళ్యాణదుర్గం రూరల్: ఓటరు వెరిఫికేషన్‌లో వలంటీర్లు యథేచ్ఛగా పాల్గొంటున్నారు. శనివారం మండల పరిధిలోని బాల వెంకటాపురం గ్రామంలో మహిళా పోలీసుతో కలసి వలంటీర్ ఇంటింటికీ తిరుగుతూ ఓటరు వెరిఫికేషన్ చేయడం చర్చనీయాంశంగా మారింది.



మహిళా పోలీసుతో కలిసి ఓటరు వెరిఫికేషన్‌లో పాల్గొంటున్న వలంటీర్

పనికొచ్చేవారితోనే రాజీనామా !

- అధికార పార్టీకి పావులుగా వలంటీర్లు
- రాజీనామాలు చేయిస్తున్న నాయకులు


బొమ్మనహాళ్, ఏప్రిల్ 6: ఎన్నికల నిబంధనల నేపథ్యంలో అధికార పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో కీలకమైన వలంటీర్లలో తమకు పనికొచ్చేవారితో రాజీనామా చేయిస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు మాత్రం వాళ్లు ఇంకా వలంటీర్లుగానే ఉన్నారని ప్రజలను నమ్మించే యత్నం చేస్తున్నారు. బొమ్మనహాళ్ మండలంలో ఇప్పటికే ఇలాంటి చర్యలు ప్రారంభమయ్యాయి.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం

బొమ్మనహాళ్ మండలంలోని 15 సచివాలయాల్లో ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున సుమారు 284 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరి సేవలు నిలిచిపోవడానికి తెలుగుదేశం పార్టీ కారణం అని ప్రజల్ని నమ్మించడానికి సామాజిక మాధ్యమాల్లో ఇప్పటికే తప్పుడు ప్రచారం ప్రారంభించారు. తాజాగా వారితో రాజీనామాలు చేయించి పార్టీ అవసరాలకు వినియోగించుకోవాలనే ఎత్తుగడ వేశారు. ఇందులో బొమ్మనహాళ్ మండల పరిధిలో గోనేహాళ్, ఉద్దేహాళ్ గ్రామ సచివాలయ పరిధిలో దాదాపు 40 మంది వలంటీర్లతో రాజీనామాలు చేయించారు. వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథరెడ్డి ప్రచారం ఏ ఊరులో మొదలవుతుందో ఆ గ్రామ వలంటీర్లతో ప్రచారా నికి ముందు రోజే రాజీనామాలు చేయించి ప్రచారంలో పాల్గొనేలా ఒత్తిడి తీసుకొస్తున్నారు.

భవితవ్యంపై భయం భయం..

రాజీనామాలు చేసేందుకు కొందరు వలంటీర్లు ససేమిరా అంటున్నారు. వలంటీరు పోస్టుకు 35 సంవత్సరాలు వయోపరిమితి. ఇప్పుడు రాజీనామా చేస్తే తర్వాత తీసుకునేందుకు సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో రాజీనామాలు సమర్పించిన వారికి అధికారపార్టీ నాయకులు రూ. 20 వేలు తాయిలంగా ఇచ్చేందుకు హామీ ఇస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల వరకు పార్టీ తరపున ప్రచారం చేయాలని, లబ్ధిదారులను కలిసి ఓట్లు వేయించాలనే షరతులు విధిస్తున్నారు. రాజీనామాలు చేసిన తర్వాత కొందరు వాలంటీర్లు ప్రచారంలో పాల్గొంటున్నారు. మరికొంతమంది నాయకులు ఒత్తిడికి మల్లగుల్లాలు పడుతున్నారు.



సత్యకుమార్‌ను కలిసిన బీవీ



సత్యకుమార్‌ను సన్మానిస్తున్న బీవీ వెంకటరాముడు

అనంతపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌ను శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు శనివారం కలిశారు. అనంతపురంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు నివాసంలో ఈ కలయిక జరిగింది. ఈ సందర్భంగా సత్యకుమార్‌కు పూలబొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. శ్రీసత్యసాయి జిల్లా రాజకీయాలపై కాసేపు చర్చించారు. అనంతరం బీవీ వెంకటరాముడు మీడియాతో మాట్లాడుతూ... ధర్మవరం నియోజకవర్గంలో సత్యకుమార్ విజయం ఖాయమన్నారు. వైసీపీ అరాచక పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సంక్షేమ పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. హిందూపురం పార్లమెంటు నియోజకవర్గంలో అన్ని అసెంబ్లీ స్థానాలను కూటమి గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

వలంటీరు, అంగన్‌వాడీ వర్కర్‌పై వేటు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 6: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వలంటీరు, ఒక అంగన్‌వాడీ వర్కర్‌పై కలెక్టరు కన్నెర్రజేశారు. శింగనమల నియోజకవర్గం ఇల్లూరు వలంటీరు పీ, రమేష్‌తోపాటు తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండలం రాయలచెరువు అంగన్‌వాడీ వర్కర్ అనసూయను విధుల నుంచి తొలగించినట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 53మంది వలంటీర్లు, 10మంది రేషన్ డీలర్లు 16మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులపై కోడ్ ఉల్లంఘనల నేపథ్యంలో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఎవరు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని కలెక్టరు హెచ్చరించారు.

9నుంచి కసాపురంలో ఉగాది ఉత్సవాలు



గుంతకల్లు టౌన్, ఏప్రిల్6: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 9నుంచి ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ విజయరాజు శనివారం తెలిపారు. 9వ తేదీన వేకువజామున స్వామి వారి మూలవిరాట్టుకు మహాభిషేకం, స్వర్ణవజ్రకవచ అలంకరణ చేసి పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఆలయ అవరణంలో పంచాంగ శ్రవణము, సాయంత్రం 6గంటలకు గరుడ వాహనంపై శ్రీసీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి గ్రామోత్సవం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. 10తేదీ సాయంత్రం 4గంటలకు రథాంగ హోమం, సంప్రోక్షణ, బలహరణ, శ్రీసీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను రథోత్సవంలో కొలువు దీర్చి రథోత్సవాన్ని నిర్వహిస్తారు, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, 11వ తేదీ రాత్రి 7.15గంటలకు లంకాదహనోత్సవం కార్యక్రమం, అనంతరం సాంస్కృతిక కార్యక్రమం, 17వ తేదీ ఉదయం 9.35గంటలకు సీతారామచంద్రస్వామి తిరుకల్యాణోత్సవాన్ని అత్యంత వైభోవతంగా నిర్వహిస్తారు. సాయంత్రం గజవాహనంపై శ్రీసీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల గ్రామోత్సవం, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

ఐక్యవేదిక జిల్లా కార్యవర్గం ఎంపిక



గోపికృష్ణ



ఈరాలప్ప

అనంతపురం విద్య, ఏప్రిల్ 6 : ఏపీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్రకో చైర్మన్ కరణం హరికృష్ణ ప్రకటించారు. శనివారం ఉపాధ్యాయభవన్‌లో జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆ సంఘం జిల్లా చైర్మన్‌గా గోపికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఈరాలప్ప, కార్యనిర్వాహణ కార్యదర్శిగా ప్రభాకర్, కోశాధికారిగా సాంబశివమ్మను, ఇతర సభ్యులుగా జాషువా, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, రామునాయక్, వెంకటేష్, మహేశ్వర్, జయరాం, శివమూర్తి, శ్రీరాములు, రవీంద్రనాయక్, నాగరాజు, వేణుఓపాల్, జయ రాం నాయక్, ఫకృద్దీన్, లక్ష్మీనారాయణ, ఈశ్వరయ్యను, రాజు నాయక్, లక్ష్మీనాయాణను ఎంపిక చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. ఉద్యోగ,ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్ల సమస్యల పోరాటానికి ఐక్యవేదిక ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.

అమిగోస్ జరిమానాలపై ఆగ్రహం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 6: జిల్లాలో ఖనిజ సంపద తవ్వకాలు, రవాణాకు ప్రైవేటు సంస్థ అమిగోస్ మినరల్స్ పెత్తనంపై నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వారా కాంట్రాక్ట్ తీసుకున్నామనే ఉద్దేశంతో ప్రైవేటు సంస్థ అమిగోస్ మినరల్స్ జిల్లాలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి దాడులు, జరిమానాలు విధించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు శనివారం హెచ్చెల్సీ కాలనీలోని జిల్లా భూగర్భ గనుల శాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితుడు రాజేష్ మాట్లాడుతూ ఆత్మకూరు, బుక్కరాయసముద్రం మండలం కేకే అగ్రహారం, కూడేరు, రాప్తాడు ప్రాంతాల్లో ప్రైవేటు అమిగోస్ మినరల్స్ సంస్థ సరఫరాదారులు నుంచి జరిమానా విధించడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం వసూలు చేయాల్సిన పన్నులు, జరిమానాలు ప్రైవేటు సంస్థకు బాధ్యత ఎవరిచ్చారని నిలదీశారు. ప్రైవేటు సంస్థకు వత్తాసుపలుకుతున్న మైన్స్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదాయాన్ని అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ బహిరంగంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి దోచుకుంటోందన్నారు. అయితే అమిగోస్ మినరల్ ప్రైవేటు సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఖనిజ తవ్వకాలు, రవాణా బాధ్యత, సీనరీజ్ వసూలు కాంట్రాక్ట్ ఇచ్చినందునే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నారని భూగర్భగనుల శాఖ జిల్లా డీడీ నాగయ్య ఈ మేరకు వివరణ ఇచ్చారు. రవాణా సరఫరా బాధితులు తదితరులు పాల్గొన్నారు.



మైన్స్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న బాధితులు

చీనీ కాయలు టన్ను రూ.31వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్6: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.31వేలు, కనిష్టంగా రూ.14వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 538టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు. ఎండల కారణంగా కాయలకు డిమాండ్ పెరుగుతోందని రైతులు పేర్కొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనంతపురంరూరల్, ఏప్రిల్ 6: నగరంలోని సంగమేష్ ఫీడర్ మెయింటేన్సెలో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు బోయ స్ట్రీట్, అశోక్‌నగర్, సూర్యనగర్ మెయిన్‌రోడ్డు, రమణ, రమేష్ థియేటర్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, సంగమేష్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రాప్తాడు, ఏప్రిల్ 6: నియోజకవర్గంలో సాధారణ ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్ తెలిపారు. శనివారం రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై ఆర్‌ఓ, ఎస్డీపీఓ, ఏఈఆర్‌ఓలు, ఎంపీడీఓలు, ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ఆర్‌ఓలు, ఎస్డీపీఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికలు సజవుగా నిర్వహించాలంటే శిక్షణ చాలా ముఖ్యమని, రిటర్నింగ్ అధికారి స్వతహాగా శిక్షణ ఇవ్వాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, షామియానాలు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల పోలింగ్ మెటీరియల్ తరలించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలన్నారు. ఎంసీసీ అమలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలన్నారు. ప్రతి ఓటరు ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాటు సిద్ధం చేసుకోవాలని అన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు, తహసీల్దార్లు సుబ్రహ్మణ్యం, పరమేశ్వరప్ప, రమాదేవి, రమణి, హమీద్‌బాషా, సీతారాములు, ఎస్డీపీఓలు, ఎంపీడీఓలు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

బసంపల్లిలో నీటి ఎద్దడి

నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు



నీటి కోసం వేచివున్న గ్రామస్థులు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 6: మండలంలోని బసంపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. నెల రోజుల నుంచి నీటి కోసం ఆ గ్రామస్థులు ఇబ్బందులు పడుతు న్నారు. గ్రామంలో ఆరు తాగునీటి పథకాల బోర్లు ఉండగా అందులో... మూడింటిలో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. మిగిలిన బోర్ల నుంచి కూడా నీరు అరకొరగా వస్తోంది. దీనికితోడు ఈ గ్రామానికి సత్య సాయి నీరు సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో కిలోమీటర్ల దూరం నుంచి నీరు తె చ్చుకో వాల్సిన పరిస్థితి నెలకొంది. బసంపల్లి క్రాస్ వద్ద నుంచి సత్యసాయి నీటిని పాల క్యాన్ల ద్వారా ఆటోలో గ్రామంలోకి తెచ్చుకుంటున్నారు. గత్యంతరం లేక ఫిల్టర్ వాటర్‌ను కొనుగోలు చేసి వాడుకుంటున్నామని ఆ గ్రామ మహిళలు వాపోతు న్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను వివరణ కోరగా... వేసవి కాలం కావడంతో రెండు బోర్లలో నీరు పూర్తిగా తగ్గిపోయిందన్నారు. మరో బోర్లలో కూడా నీరు అరకొరగా వస్తోందని, గ్రామంలో కొన్ని ప్రాంతాలకు నీరు సక్రమంగా ఎక్కడంలేదని అన్నారు. అక్కడికి వెళ్లి పరిశీలించి సమస్య పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామన్నారు.



ఆటోలో పాల క్యాన్లలో తెచ్చిన నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఆధారాలు లేని నగదు సీజ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 6: అనంతపురానికి చెందిన సురేష్‌కుమార్‌రెడ్డి రూ.2 లక్షల నగదును ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకొని వెళ్తుండగా... నగరంలోని నాయక్‌నగర్ రైల్వే గేటు సమీపంలో టూటౌన్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును సీజ్ చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించామని సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

ముమ్మర తనిఖీలు : వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట అనధికారికంగా తీసుకెళ్తున్న రూ.లక్ష నగదును సీజ్ చేశారు. బోయవీధి, సున్నపుగేరు, నీరుగంటివీధి, వేణుగోపాల్‌నగర్‌లలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు.

తొమ్మిది నెంబర్ల తరహా కాదు

● అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందిస్తా: టీడీపీ అభ్యర్థి దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 6 : ప్రజలు ఏదైనా సమస్య ఉంటే తనకు నేరుగా ఫోన్ చేయవచ్చుని.. అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందిస్తానని అనంత అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. తనది తొమ్మిది నెంబర్ల ఫోన్ తరహా వ్యవహారం కాదని ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డికి చురక అంటించారు. శనివారం స్థానిక 35వ డివిజన్‌లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధులు దగ్గుబాటి ప్రసాద్‌ను ఆప్యాయంగా పలుకరించారు. డివిజన్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, టౌన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, నాయకులు ప్రకాష్‌నాయుడు, రాజారావు, రాయల్ మురళీ, బుగ్గయ్యచౌదరి, దళవాయి వెంకట నారాయణ, సిమెంట్ పోలన్న, పోతుల లక్ష్మీనరసింహులు, గోళ్ల సుధాకర్ , లింగారెడ్డి, సైఫుద్దీన్, నెట్టం బాలకృష్ణ, కడియాల కొండన్న, గంగవరం బుజ్జి, సంగా తేజస్విని, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అనంతవి అసత్య ప్రచారాలు

అండర్ డ్రైనేజీకి పది రూపాయలైనా నిధులు కేటాయించకుండా కొవిడ్ మూలంగా ఆగిపోయిందని అసత్యాలు ప్రచారం చేయడంతోనే ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి డొల్లతనం బయటపడిందని అనంత పురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. మోటార్లు చెడిపోతే... ఇప్పుడు టెండర్లు పిలవడం చేతులుకాలాక ఆకులు పట్టుకున్నట్లుగా ఉందని విమర్శించారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు చేయడం మానుకో వాలని



సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న దగ్గుబాటి ప్రసాద్

హితవు పలికారు. వైసీపీ నాయకుల అరాచకాలు సహించ లేకనే అనేక మంది నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకుం టున్నారన్నారు. వారి చేరికలను జీర్ణించుకోలేకనే ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఆ పార్టీ నాయకులు అవాకులు, చవాకులు పేలు తున్నారని దుయ్యబట్టారు. అనంత అర్బన్‌లో ప్రతి పనిలోనూ అవినీ తికి పాల్పడ్డారని ఆరోపించారు. కేంద్ర నిధులతో వేసిన రహదారుల్లోను అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. వైసీపీ ఐదేళ్లల్లో నగరాన్ని భ్రష్టు పట్టించారని, రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయని, తాగునీటి సమస్య ను పరిష్కరించలేని దుస్థితిలో వైసీపీ పాలకులు ఉన్నారని అన్నారు. ఏం మొహం పెట్టుకొని ఓట్లు అడుతారనంటూ నిలదీశారు. కాగా, దగ్గుపాటి ప్రసాద్ నివాసంలో 18వ డివిజన్ పరిధిలోని గుల్జార్‌పేటకు చెందిన కొంతమంది వైసీపీ యువకులు టీడీపీలో చేశారు.

ఈ ఐదేళ్లలో ఎమ్మెల్యే సోదరులే బాగుపడ్డారు

● మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, ఏప్రిల్ 6: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో బాగుపడింది కేవలం ఎమ్మెల్యే, ఆయన సోదరులు మాత్రమేనని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. శనివారం ఆమె మండలంలోని చెర్లోపల్లి, పోలేపల్లి, పాపిరెడ్డిపల్లి, అక్కంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆమె సమక్షంలో టీడీపీలోకి చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.... వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని, ప్రజలందరూ దీనిని గమనించి వారికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని కోరారు. ఒక చేత కాని దద్దమ్మ రాప్తాడు ఎమ్మెల్యేగా ఉన్నారని... ఈ ఐదేళ్లలో రోడ్లు వేయకుండా కాంట్రాక్టర్లను అడ్డుకుని ఆ నెపాన్ని తమపై నెట్టేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఆయన సోదరులు గ్రామాల వైపు కన్నెత్తి చూడలే దని మండిపడ్డారు. నిత్యం బెదిరింపులు, దౌర్జన్యాలు, దోపిడీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారంతో కాలం గడిపారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : అనంతపురంలోని పరిటాల సునీత క్యాంప్ కార్యాలయంలో పలువురు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రామగిరి మండలం పోలేపల్లి పంచాయతీ పాపిరెడ్డిపల్లి, రాప్తాడు, అనంతపురంరూరల్ మండలంలోని కామారుపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.



చెర్లోపల్లిలో మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అరటి ఆశలు నేలపాలు

- అడుగంటిన భూగర్భజలాలు
- వ్యవసాయ బోర్లలో తగ్గుతున్న నీటి మట్టం
- తేమలేక నేలకొరుగుతున్న అరటిపంట
- దిక్కుతోచని స్థితిలో రైతులు

బెళుగుప్ప, ఏప్రిల్ 6: భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయ బోర్లలో నీటిమట్టం తగ్గడంతో అరటి పంటలు నేలకొరుగుతున్నాయి. పంటపై పెట్టుకున్న ఆశలన్నీ నేలపాలవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ. లక్షలు వెచ్చించి అరటి పంటను మండలవ్యాప్తంగా 1510 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. ప్రస్తుతం కోత దశలో వుండగా చెట్టుకు అవసరమైనంత నీరు లేకపోవడంతో గెలలతో సహా నేలకొరుగుతున్నాయి. గిట్టుబాటు ధర లేక సతమతమవుతుండగా గోటిచుట్టుపై రోకలిపోటులా నీటి సమస్య తలెత్తడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రస్తుతం కిలో ధర రూ. పదిలోపే వుంది. చెట్లనీ గెలలతో పడిపోతుండటంతో వ్యాపారులు అయినకాడికి అడుగుతున్నారు. తోటలోనే పంటంతా నిలువునా ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు.



వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండండి

అనంతపురం టౌన్, ఏప్రిల్ 6: ఎండలు ఎక్కువగా ఉన్నాయని, బయట తిరిగితే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యాధికారి ఈ.బీ. దేవి ప్రజలకు సూచించారు. శనివారం ఆమె తన చాంబర్‌లో మాట్లాడుతూ... వడదెబ్బపై బీకేఎస్ మండలం కొర్రపాడు పీహెచ్‌సీలో అవగాహన కల్పించామన్నారు. వడదెబ్బ పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. వడదెబ్బ తగిలిన లక్షణాలు కల్పిస్తే వెంటనే నీడ ప్రాంతానికి వెళ్లి.. తడిగుడ్డతో తుడిచి ఉష్ణోగ్ర తను తగ్గించాలన్నారు.



వడదెబ్బపై కొర్రపాడులో అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ

సొసైటీల కంప్యూటరీకరణపై వైసీపీ నిర్లక్ష్యం



రాచానపల్లి సొసైటీ



కేంద్రం నిధులతో ఏర్పాటు చేసిన జన ఔషధి కేంద్రం బోర్డులో జగన్ ఫొటో

- ఐదేళ్లుగా కాలయాపన
- చివరకు చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం
- టేకోవర్ చేసిన కేంద్రం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 6 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సొసైటీ)లను కంప్యూటరీకరణ చేస్తామని 2019లో సీఎంగా బాధ్యతలు స్వీకరించిన జగన్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. ప్యాక్స్‌ను ఆన్‌లైన్ చేస్తామని ఐదేళ్ల పాటు కాలయాపన చేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వం చివరకు చేతులెత్తేసింది. దీంతో కేంద్రం టేకోవర్ చేసి ప్యాక్స్‌ను ఆన్‌లైన్ చేసి ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయడానికి శ్రీకారం చుట్టింది. జాతీయ స్థాయిలో నేషనల్ డెవలప్‌మెంట్ కమిటీ, రాష్ట్రస్థాయిలో స్టేట్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీలతో పాటు జిల్లా స్థాయిలో డీసీడీసీలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) కన్వీనర్‌గా ఉండే కమిటీలో జేసీ, జెడ్పీ సీఈఓ, పశుసంవర్థక శాఖ జేడీ, మత్స్యశాఖ డీడీ, డీపీఓ, నాబార్డు డీడీఎంలతో పాటు ఆయా సమన్వయ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈనెలకారులోపు సొసైటీలలో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించి అవినీతి, అక్రమాలను అరికట్టి, రైతులకు మెరుగైన, నాణ్యమైన పారదర్శక సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సహకార శాఖ అధికారులు సొసైటీలను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, రైతులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే సొసైటీల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజలకు మరిన్ని సేవలను చేరువచేయడానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇదివరకు పనిచేసిన మీ-సేవ కేంద్రాల తరహాలో అన్ని రకాల సేవలను అందించేందుకు చర్యలు చేపట్టింది. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించేందుకు సీడ్ సొసైటీ, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సాహించేందుకు ఆర్గానిక్ సొసైటీ, రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సొసైటీలతో సహకార సొసైటీలను అనుసంధానం చేస్తోంది. వీటితో జిల్లాలో రాచానపల్లి, పీ కొత్తపల్లి పరిధిలో వంకరాజు కాలవ, ఎద్దులపల్లి, పాళ్యం తండా, బొమ్మనహాల్, బేలేడు, బుక్కరాయసముద్రంలో గోడౌన్లను ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను నిల్వ చేస్తుంది. యల్లనూరు, కణేకల్ ప్రాంతాలతో పాటు నార్పల, ఆమిద్యాల, కూడేరులలో సొసైటీల ఆధ్వర్యంలో పెట్రోలు బంకులు ప్రారంభించేలా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే యల్లనూరులో ప్రారంభించగా, కణేకల్‌లో పనులు జరుగుతున్నాయి. ప్రజలకు తక్కువ ధరకే మందులు అమ్మేందుకు జన ఔషధి పేరుతో జనరిక్ మందుల షాపులను సొసైటీల ఆధ్వర్యంలో ప్రారంభించారు. తొలి విడతలో అనంతపురం డీసీఎంఎస్, రాచానపల్లి, ముచ్చుకోట, గుంతకల్లు, రాయదుర్గం ఉద్దేహాల్, కళ్యాణదుర్గం చాపిరిలో ప్రారంభించారు. కాగా, కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న పథకాలకు కూడా సీఎం జగన్‌రెడ్డి తన ఫొటోను, తమ పార్టీ రంగులను ఉపయోగించుకోవడం పలు విమర్శలు తావిస్తోంది.

9 సార్లు ఎన్నికలు వాయిదా : సొసైటీలకు ప్రతి ఐదేళ్ళకు ఒక మారు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. సహకార సొసైటీల బైలా ప్రకారం నిర్వహించాల్సిన ఎన్నికలను 2019లో జరపాలి. అయితే కొత్తగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం కరోనా సాకుతో ఇప్పటికే 9సార్లు ఎన్నికలను వాయిదా వేసింది. రాజకీయ నిరుద్యోగులను సొసైటీలు, ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లకు నామినేటెడ్ కింద పాలకవర్గాలను నియమిస్తూ ఉపాధి చూపుతోంది. దీంతో నామినేటెడ్ పాలకవర్గాలు ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ... సొసైటీలు, బ్యాంకులను యథేచ్ఛగా దోచేస్తున్నా...అడిగే నాథుడే కరువయ్యారు. సొసైటీలలో నామినేటెడ్ పదవులతో సీట్లో కూర్చున్న పాలకవర్గాలు బైలాకు విరుద్ధమైన నిర్ణయాలు తీసుకుంటూ, సొసైటీలను బలహీన పరుస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేయడానికే సొసైటీల కంప్యూటరీకరణను అటకె క్కించారనే వాదనలు ఆశాఖలో వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్ సేవలు లేకపోవడంతో అవినీతి, అక్రమాలు యథేచ్ఛగా చేసుకోవచ్చనే సంకేతాలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకనే ఇచ్చేస్తోందనేది చర్చ సాగుతోంది.

కేంద్రం నిధులతోనూ సొసైటీ కంప్యూటరీకరణ



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీలు) కేంద్రం నిధులతో కంప్యూటరీకణ ప్రక్రియ చేపట్టాం. ఈ నెలాకరులోపు ఆన్‌లైన్ సేవలు జిల్లాలోని 64 సొసైటీల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. యుద్ధ ప్రాతిపదికన ప్రక్రియ సాగుతోంది. మొత్తం 108 అంశాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు సిబ్బందికి సూచించాం. సొసైటీలలో పారదర్శక సేవలు అందించేందుకు కంప్యూటరీకరణ చాలా దోహదపడుతుంది. అంతేగాక సొసైటీల ద్వారా ప్రజలకు చౌకగా సేవలు అందించడం, సొసైటీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్రం పెట్రోలు బంకులు, జన ఔషధి కేంద్రాల ద్వారా జనరిక్ మందులు తక్కువ ధరకే విక్రయించడం చేస్తోంది.

- ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

ఘనంగా సతామి



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 6: రంజాన్ సతామి వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ మేరకు శనివారం గఫూర్ కాలనీలోని మజీద్-ఏ-మహమ్మదీయలో సతామి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మజీద్ ముతవల్లి డా. అబ్దుల్ రజాక్ గఫూర్, మౌలానా మహమ్మద్ సద్దాం హుస్సేన్, ముస్లింలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారు మాట్లాడు తూ... పవిత్ర రాత్రులలో లైలతుల్ ఖదర్ రాత్రి 1000 రాత్రుల్లో చాలా గొప్పదన్నారు. ఇది రంజాన్ చివరి పది రాత్రులల్లో వస్తుందన్నారు. ఆ రాత్రిని నైట్ ఆఫ్ పవర్, నైట్ ఆఫ్ డిక్రీ అని పిలుస్తారన్నారు. పవిత్ర ఖురాన్ మహమ్మద్ సల్లాలాహు అలైహి సల్లాంకి అవతరించిన సందర్భంగా సతామిని జరుపుకుంటారన్నారు.

ఈవీఎంల తనిఖీ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 6: స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయం ఆవరణంలోని గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ శనివారం పరిశీలించారు. జేసీ కేతన్‌గార్గ్, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్‌లతో కలిసి పరిశీలించారు. జిల్లాకు ఎన్ని ఈవీఎంలు, వీవీప్యాట్లు వచ్చాయి... మొదటి విడత ర్యాండమైజేషన్ చేపట్టారా... యంత్రాల పనితీరు ఎలా ఉంది... తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి భద్రతా చర్యలను పరిశీలించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ ... ఈనెల 12 నుంచి రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ మొదలవుతుందని, ఇందుకోసం పక్కాగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు ర్యాండమైజేషన్ సమయంలో గట్టి పోలీస్ భద్రత ఉండేలా చూడాలని సూచించారు. ఆయన వెంట డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, తహసీల్దార్ శివరామిరెడ్డి ఉన్నారు.

ఆ ఇద్దరు ఎంఈఓలకు మినహాయింపు ఎందుకు ?

అనంతపురం విద్య, ఏప్రిల్ 6: పదో తరగతి పరీక్షా పేపర్లు మూల్యాంకనంలో నలుగురు ఎంఈఓలను స్పాట్ విధుల నుంచి తప్పించి, ఇద్దరు ఎంఈఓలను మాత్రం అలాగే ఉంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఆర్‌జేడీ, జిల్లా పరీక్షల పరిశీలకుడు రాఘవరెడ్డి స్పాట్‌ను సందర్శించారు. మండలాల్లో ఉండాల్సిన ఎంఈఓలను స్పాట్ విధులకు నియమించడంపై ఆయన అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో నలుగురు ఎంఈఓలను వెంటనే స్పాట్ విధుల నుంచి రిలీవ్ చేశారు. అయితే ఎంఈఓలు శివప్రసాద్, శ్రీదేవిలను అలాగే స్పాట్ విధుల్లోనే కొనసాగిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ నలుగురిని మండలాలకు పంపడం, ఈ ఇద్దరినీ అలాగే ఉంచడం పలు విమర్శలకు తావిస్తోంది.

18 మంది జూదరుల అరెస్ట్

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 6: మండలంలో రేకలకుంట, దయ్యాల కుంటపల్లి గ్రామాల్లోని పేకాట స్థావరాలపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. రేకలకుంట గ్రామం వద్ద 11 మందిని అరెస్టు చేసి.. రూ.18 వేలను, దయ్యాలకుంట చెరువులో ఏడుగురిని అరెస్ట్ చేసి రూ.7500ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మొత్తం 18 మందిని అరెస్టు చేసి... వారి నుంచి రూ.25,500 స్వాధీనం చేసుకున్నామని, వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రంజాన్ తోఫా అందజేత



తోఫా అందజేస్తున్న కార్పొరేటర్ బాబాఫక్రుద్దీన్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 6: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని 12వ డివిజన్‌లోని పలువురు పేద ముస్లింలు, మున్సిపల్ కార్మికులకు టీడీపీ నాయకుడు, కార్పొరేటర్ బాబాఫక్రుద్దీన్ శనివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. తమ నేత జయరాంనాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరామని, ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు.

బడిలోకి బాల కార్మికుడు

అనంతపురం విద్య, ఏప్రిల్ 6: ఆపరేషన్ స్వేచ్ఛ ఫేజ్ -2లో భాగంగా అనంతపురంలో ఓ బాల కార్మికుడిని స్కూల్‌లో చేర్పినట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి శనివారం తెలిపారు. ఐసీడీఎస్, చైల్డ్‌లైన్, కార్మిక, పోలీస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం తదితర శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 11 వరకూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా పాతూరులోని చెన్నకేశవస్వామి గుడి వెనుక మోటార్ మెకానిక్ షాప్‌లో పనిచేసే ఓ బాల కార్మికుడిని గుర్తించామన్నారు. బాలుడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, వారిని ఒప్పించి బాలుడిని 9వ తరగతి డ్రాపౌట్‌గా గుర్తించి బుక్కరాయసముద్రం హైస్కూల్‌లో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ సమన్వయకర్త కృష్ణమాచారి, ఇతర ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే తొమ్మిది గ్యారెంటీ పథకాలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 6: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తొమ్మిది గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని రాప్తాడు నియోజవర్గ ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్ అన్నారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ వస్తే ప్రధానిగా రాహుల్ గాంధీ ఏపీకి ప్రత్యేక హోదా పైనే మొదటి సంతకం చేస్తారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శివశంకర్ యాదవ్, వాసు, గోవిందు, జాన్‌వేస్లీ, మురళీ, వేంకటేష్, నగేష్, కవిత పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీఐటీ వార్షికోత్సవం



కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు

రాప్తాడు, ఏప్రిల్ 6: మండలంలోని హంపాపురం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 15వ వార్షికోత్సవాల్లో భాగంగా యాన్యువల్ డే 2కే24 నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా ఉద్యోగ మేళాలు నిర్వహించి అనేక మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు విద్యతో పాటూ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ఆట పాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ, చైర్మన్ క్రిష్ణారెడ్డి, వైస్ చైర్మన్ రవీంద్రారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, సీఈఓ ఆనంద్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి శివారెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసమే కూటమికి మద్దతు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 6: ఎస్సీ వర్గీ కరణ సాధన కోసమే మంద కృష్ణమాదిగ కూటమికి సంపూర్ణ మద్దతు ఇచ్చారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కురుగుంటలోని ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం దళితులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అయినా ఎంఆర్‌పీఎస్ బ్రహ్మయ్య వాటిని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వైసీపీ నాయకులుగా చెలమణి అవుతూ.. పెద్ద పెద్ద కండువాలు వేసుకొని తాము జాతీయ అంతర్జాతీయ నాయకులని చెప్పుకోవడం కాదన్నారు. వైసీపీ నాయకులు కాళ్ల దగ్గర కాసులకు కక్కుర్తి పడి జాతీ గౌరవాన్ని తుంగలోకి తొక్కి... మంద కృష్ణ మాదిగను విమర్శించడం మంచిది కాదన్నారు. వైసీపీ నాయకుల మెప్పు కోసం విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

- ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే

ఉరవకొండ, ఏప్రిల్ 6: వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణంలో కామన్న కట్ట, గాంధీబజార్, గురికాల వీధుల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అంతకుమునుపు నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. మాబుసుబాని కట్ట వద్ద ప్రార్థనలో పాల్గొన్నారు. ఇంటింటికీ సూపర్ సిక్స్ పథకాల వల్ల కలిగే లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, విజయ్‌భాస్కర్, రేగాటి నాగరాజు, మారెన్న, కుళ్లాయప్ప, జనసేన ఇన్‌చార్జి గౌతమ్ పాల్గొన్నారు.

కూడేరు: అరాచక పాలనకు చరమగీతం పాడేసమయం ఆసన్నమైయిందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమ్ సింహ అన్నారు. శనివారం కూడేరు మండలం అరవకూరు గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామంలో ఘనస్వాగతం లభించింది. అనంతరం ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు.

బెళుగుప్ప: మండలంలోని గంగవరంలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విజయ్ సింహా పాల్గొని ప్రచారం చేశారు.

అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి

రాయదుర్గం రూరల్: అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించాలని కాలవ భరత్ కోరారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, నాయకులతో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు అశోక్, రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు హనుమంతు, గిరిధర్‌నాయుడు, భోజరాజు, వీరేష్ పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉంది

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం



పోస్టరును విడుదల చేస్తున్న గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 6: క్రైస్తవుల అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం ఉదయం క్రైస్తవుల సంక్షేమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పాస్టర్లకు ఐడీలు, ఆరోగ్య బీమా సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ క్రిష్టయన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఇరానీవాసులను గుమ్మనూరు సోదరుడు శ్రీనివాసులు శనివారం కలసి టీడీపీకి మద్దతు ఇవ్వాలన్నారు. ఆయనవారితో సమావేశమై గుమ్మనూరు జయరాంను గెలపించాలని కోరారు.

అభివృద్ధి కోసం టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 6: యాడికి మండలం చిక్కేపల్లి గ్రామ అభివృద్ధి కోసం టీడీపీలో చేరుతున్నట్లు రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటరాముడు తెలిపారు. శనివారం ఆ గ్రామానికి చెందిన 30మంది మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అభివృద్ధిని కోరే వారు టీడీపీలోకి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో చిక్కేపల్లి టీడీపీ నాయకులు నాగిరెడ్డి, దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజక కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం

పట్టణంలోని నందలపాడులో శనివారం రజక కమిటీ ఆధ్వర్యంలో టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రచారంలో కౌన్సిలర్ విజయ్‌కుమార్, టీడీపీ రజక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం



మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో శనివారం టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టినటువంటి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు.



మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 6: స్థానిక బీజేపీ రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి నివాసం వద్ద శనివారం బీజేపీ పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ కర్నూలు జిల్లా ఇన్‌చార్జి అంకాల్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ 400ఎంపీ స్థానాలు కైవసం చేసుకొని మరోసారి అధికారంలోకి రానుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రంగనాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, రూరల్ అధ్యక్షుడు రాంబాబు, లీగల్ మాజీ జిల్లా కన్వీనర్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. శ్యాంప్రసాద్‌ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, అసెంబ్లీ కన్వీనర్ బండారు కృష్ణమూర్తి, నాయకులు కొలమి రంగన్న, కొలమి శేఖన్న, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

అరటి ఆశలు నేలపాలు

- అడుగంటిన భూగర్భజలాలు
- వ్యవసాయ బోర్లలో తగ్గుతున్న నీటి మట్టం
- తేమలేక నేలకొరుగుతున్న అరటిపంట
- దిక్కుతోచని స్థితిలో రైతులు



ఎలగలవంకలో నేలకొరిగిన అరటిపంట

బెళుగుప్ప, ఏప్రిల్ 6: భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయ బోర్లలో నీటిమట్టం తగ్గడంతో అరటి పంటలు నేలకొరుగుతున్నాయి. పంటపై పెట్టుకున్న ఆశలన్నీ నేలపాలవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ. లక్షలు వెచ్చించి అరటి పంటను మండలవ్యాప్తంగా 1510 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. ప్రస్తుతం కోత దశలో వుండగా చెట్టుకు అవసరమైనంత నీరు లేకపోవడంతో గెలలతో సహా నేలకొరుగుతున్నాయి. గిట్టుబాటు ధర లేక సతమతమవుతుండగా గోటిచుట్టుపై రోకలిపోటులా నీటి సమస్య తలెత్తడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రస్తుతం కిలో ధర రూ. పదిలోపే వుంది. చెట్లనీ గెలలతో పడిపోతుండటంతో వ్యాపారులు అయినకాడికి అడుగుతున్నారు. తోటలోనే పంటంతా నిలువునా ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు.

పంట నేలపాలైంది

ఎనిమిది ఎకరాలలో అరటి సాగు చేశాను. ఎకరాకు రూ. లక్ష వరకు పెట్టుబడిపెట్టాను. నీటిమట్టం బాగా తగ్గింది. తేమలేక చెట్లు నేలవాలిపోతున్నాయి. గతంలో కిలో రూ. 25గా ధర ఉన్నింది. ప్రస్తుతం నీరు లేక చెట్లు నేలకొరుగుతుండటంతో పంటను అడిగేవారే కరువయ్యారు.

- అరటి రైతు సురేష్, యలగలవంక

నీరులేక నష్టపోతున్నాం..

నీరులేక పంటను నష్టపోతున్నాం. ఆరుగాలం శ్రమించి పండించిన అరటి పంటంతా నేలపాలవుతోంది. ఐదు ఎకరాలలో సాగు చేసిన అరటి పంటకు ప్రస్తుతం బోర్లలో నీటి మట్టం తగ్గింది. ఈ పంటకు నీరు సమృద్ధిగా అందాలి. లేకుంటే చెట్టు పడిపోతుంది. పంట దిగుబడి బాగా వచ్చింది. కష్టాలు తీరుతాయని ఎంతో ఆశతో ఉన్న సమయంలో భూగర్భ జలాల సమస్య వెంటాడుతోంది.

- లావణ్య, అరటి రైతు, కోనాపురం



టీడీపీ అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం



ఎరుకల కులస్థులతో అమిలినేని సురేంద్రబాబు



ఐటీ ఫోరం నాయకులతో ర్యాలీలో పాల్గొన్న అంబిక, అమిలినేని

టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం , ఏప్రిల్ 6: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అందరికీ న్యాయం చేస్తామని అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రజావేదిక వద్ద ఎరుకల సోదరుల ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో అమిలినేని సురేంద్రబాబు, ఎరికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, మాజీ ఎంపీటీసీ రాయుడు, మాజీ సర్పంచ్ నాగరాజు, ముత్యాలు, మారెన్న, అనంతపురం పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరికలు మాట్లాడుతూ నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. అమిలినేని మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏకలవ్య మ్యూజియం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినా జగన్మోహన్‌రెడ్డి దాన్ని నిర్వీర్యం చేశారన్నారు. నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన 23 పథకాలను రద్దు చేసి వారికి తీవ్ర అన్యాయం చేశాడన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడుతో మాట్లాడి ఏకలవ్య మ్యూజియం, కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

యువతకు ఉద్యోగాలు చంద్రబాబుతోనే...

కళ్యాణదుర్గంరూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమని అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం బెంగళూరు నుంచి వచ్చిన ఐటీ ఫోరం అధ్యక్షుడు రాజు, ఐటీ నిపుణుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భవన్ నుంచి ప్రజావేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్ సీఎం అయ్యాక రాష్ట్రానికి రావాల్సిన కంపెనీలన్నీ పక్క రాష్ట్రాలకు వెళ్లాయన్నారు. కియా మోటార్స్ సంస్థను జిల్లాకు తీసుకువచ్చి వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో అమిలినేని కుటుంబ సభ్యులు

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని ఎర్రప్పదొడ్డి, తిప్పయ్యదొడ్డి, తాటాకుల దొడ్డి గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు కుమార్తె చరిత, సోదరి పద్మావతి, కుటుంబ సభ్యులు ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, నాయకులు కేశవరెడ్డి, రాహుల్, వన్నూరుస్వామి, యర్రిస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెద్దారెడ్డి నుంచి ప్రాణహాని

సోషల్‌మీడియాలో వైసీపీ కార్యకర్త

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 6

వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డితోపాటు ఆయన ముఖ్య అనుచరుడు మునిరెడ్డి వల్ల తనకు ప్రాణహాని ఉందని వైసీపీ కార్యకర్త పల్లె కొండారెడ్డి శనివారం సోషల్‌మీడియాలో చేసిన వ్యాఖ్యలు హల్‌చల్ చేస్తున్నాయి. సోషల్‌మీడియా ద్వారా ఆయన మాట్లాడుతూ 2019ఎన్నికల్లో వైసీపీ తరపున ఏజెంట్‌గా కూర్చున్నానని, విజయం తర్వాత తనను ఎవరూ పట్టించుకోలేదన్నారు. దీంతో తనపని తాను చేసుకుంటూ ఉన్నానన్నారు. శనివారం నంద్యాలరోడ్డులో స్కూల్‌వద్ద తన పిల్లలను వదిలి వెళుతుండగా మునిరెడ్డి ఎదురుపడడంతో మాటమాటపెరిగి ఘర్షణ వాతావరణం ఏర్పడిందని, తనకు, తన సోదరుడు పల్లె వీరశేఖర్‌రెడ్డికి ఏమైనా జరిగితే ఎమ్మెల్యేతోపాటు ఆయన అనుచరుడు మునిరెడ్డి కారణమని సోషల్‌మీడియాలో చెప్పారు. కాగా విషయం తెలుసుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి వాగ్వాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న పల్లె కొండారెడ్డి

కార్మికులపై బైండోవర్ కేసులు దారుణం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 6: శ్రీరామిరెడ్డి వాటర్ కార్మికులపై పట్టణ పోలీసు స్టేషన్‌లో బైండోవర్ కేసులు నమోదు చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. బైండోవర్ కేసులు నమోదు చేశారన్న విషయం తెలుసుకుని ఆయన పోలీసుస్టేషన్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో జీతాలను అడిగినందుకు ఆర్‌డబ్ల్యూఎస్, ఈడీలు ఇతర కారణాలను సాకుగా చూపి బైండోవర్ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. వెంటనే కేసులను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి యూనియన్ జిల్లా సెక్రెటరీ రాము, ట్రెజరర్ వన్నూరుస్వామి, రాయదుర్గం డివిజన్ ఉపాధ్యక్షులు అశోక్, గంగాధర, హనుమంతరెడ్డి, రమేష్, చిత్తయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

డీఎస్పీ శ్రీనివాసులు



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ, సిబ్బంది

బొమ్మనహాళ్, ఏప్రిల్ 6: స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని శ్రీధరఘట్ట, కొళగానహళ్లి, దేవగిరి, ఉంతకల్లు, నేమకల్లు గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామాల్లో శాంతియుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎవరి ప్రలోభాలకు లొంగవద్దని డీఎస్పీ అన్నారు. కార్యక్రమంలో రాయదుర్గంరూరల్ సీఐ ప్రసాద్‌బాబు, బొమ్మనహాళ్ ఎస్ఐ శ్రీనివాసులు, బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్‌కుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు మనోజ్‌కుమార్, రాజన్‌త్యాగి, కుల్‌దీప్‌సింగ్‌రాథోడ్ పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలోని దంతలపల్లి గ్రామంలో శనివారం పుట్లూరు సర్కిల్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. కవాతులో ఎస్ఐ గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలలో మార్చ్‌ఫాస్ట్

కణేకల్లు: మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని యర్రగుంట, బెణకల్లు, గోపులాపురం గ్రామాలలో మార్చ్‌ఫాస్ట్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రశాంత వాతావరణంలో పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రసాద్ బాబు, ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 6: కంబదూరు మండల కేంద్రంలోని ఆంధ్ర కర్ణాటక రాష్ట్రాల అంతర్గత చెక్‌పోస్టును శనివారం తనిఖీ చేసిన అనంతపురం జిల్లా నూతన ఎస్పీ అమిత్ బర్దార్‌ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు కేంద్రాల వద్ద పని చేసే ఎన్నికల సిబ్బంది చాలా జాగ్రత్తగా విధులను నిర్వర్తించాలని, సీసీ ఫుటేజి సక్రమంగా పని చేసేలా చూడాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్థానిక సిబ్బందిని హెచ్చరించారు.

ఐటీ నిపుణుల ర్యాలీకి తరలిరండి

కణేకల్లు, ఏప్రిల్ 6: రాయదుర్గంలో ఆదివారం జరిగే ఐటీ నిపుణుల ర్యాలీకి కణేకల్లు మండలంలోని నాయకులు, యువత పెద్ద ఎత్తున తరలిరావాలని మండల తెలుగుయువత అధ్యక్షుడు బాయినేని నవీన్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు టీడీపీ కార్యాలయం నుండి ఎన్‌టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ జరుగుతున్నందున విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సూపర్‌సిక్స్ పథకాలను వివరించండి

పుట్లూరు, ఏప్రిల్ 6: మండలవ్యాప్తంగా బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, ఏప్రిల్ 6: మండల పరిధిలోని పెన్న హోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై బైక్ ర్యాలీ

గుత్తి, ఏప్రిల్ 6: 'ఓటు విలువ తెలుసుకో భవిష్యత్తు కాపాడుకో' నినాదంతో పట్టణంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ఎన్టీఆర్, గాంధీ సర్కిళ్ల వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ఆర్వో శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, తహసీల్దారు భారతి, డీటీ లలిత, ఎంపీడీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 6: పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో శనివారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. నవభారత్ కో లిమిటెడ్ కంపెనీకి చెందిన జనరల్ మేనేజర్ రఘుపతి ఇంటర్వ్యూలను నిర్వహించారు. కార్యక్రమంలో జేకేసీ ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ నాగరాజు, జేకేసీ సెంటర్ పుల్లయ్య, అధ్యాపకులు క్రుపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నారు'

పుట్లూరు, ఏప్రిల్ 6: మండలంలోని కందికాపుల, చింతకుంట గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు బిల్లులు రాకుండా పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని సర్పంచు శివరామయ్య జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో శనివారం ఏఓ విశ్వనాథరెడ్డికి రాతపూర్వకంగా ఫిర్యాదుచేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను చూపుతున్న సెబ్ సిబ్బంది

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 6: పట్టణ, పుట్లూరు మండలంలో శనివారం జరిగిన దాడుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 60మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర తెలిపారు. అందిన సమాచారం మేరకు పట్టణ సమీపంలోని బైపాస్‌రోడ్డులో అక్రమంగా మద్యం బాటిళ్లను నిల్వ ఉంచిన పోరాటకాలనీకి చెందిన ఓబులేసు నుంచి 45మద్యం బాటిళ్లు, పుట్లూరు మండలం గాండ్లపాడుకు వెళ్లే మలుపులో యల్లనూరు మండలం చిలమకూరు గ్రామానికి చెందిన లింగమయ్య నుంచి 15మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని చిన్నపొలమడ గ్రామం వద్ద శనివారం అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ అశోక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర తెలిపారు.

కర్ణాటక మద్యం...

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆంథోని స్ట్రీట్‌లో రైల్వే ట్రాక్ వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న హరిజన బొందల సూర్యప్రకాష్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. సమాచారం మేరకు దాడులు నిర్వహించి 90ఎంఎల్ 11 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

డీ.హీరేహాళ్: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. శనివారం సోమలాపురం సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన భీమప్ప తన ద్విచక్రవాహనంపై కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడిని అదుపులోకి తీసుకుని 384 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

కల్లగళ్లలో చోరీ

కూడేరు, ఏప్రిల్ 6: మండల పరిధిలోని కల్లగళ్ల గ్రామంలో శనివారం ఉదయం 3 గంటల సమయంలో కుళ్లాయిస్వామి ఇంటో చోరీ జరిగింది. 28 గ్రాముల బంగారం, 34 తులాల వెండి చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డబ్బు ఇవ్వమన్నందుకు దాడి

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 6: తనకు బకాయి ఉన్న నగదును ఇవ్వమన్నందుకు తిప్పేస్వామి తనపై దాడిచేసినట్లు శంకర్‌నాయక్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కులం పేరుతో దూషించాడని పేర్కొన్నారు. ఆయనకు మద్దతుగా దళిత, గిరిజన సంఘాలు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపాయి. వెంటనే తిప్పేస్వామిపై చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు.

వైభవంగా పెద్దకదిరప్ప స్వామి ఊరేగింపు

గుత్తిరూరల్, ఏప్రిల్ 6: మండలంలోని బ్రాహ్మణపల్లి, పూలకుంట గ్రామాల్లో పెద్దకదిరప్ప స్వామి ఊరేగింపు శనివారం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గుంతకల్లు గుత్తి, పామిడి మండలాల్లోని గ్రామాలో ఆనవాయితీగా ప్రతిఏడాది మార్చి, ఏప్రిల్ మాసాలలో పెద్దకదిరెప్ప ఉత్సవ విగ్రహాన్ని 25 రోజులపాటు పల్లకీలో ఉంచి ఊరేగిస్తారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటు స్వామి వారి ఊరేగింపు జరుగుతుందని అర్చకులు రామాంజునేయులు, కార్తీక్ తెలిపారు.

ఆధారాలు లేని నగదు సీజ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 6: అనంతపురానికి చెందిన సురేష్‌కుమార్‌రెడ్డి రూ.2 లక్షల నగదును ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకొని వెళ్తుండగా... నగరంలోని నాయక్‌నగర్ రైల్వే గేటు సమీపంలో టూటౌన్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును సీజ్ చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించామని సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

ముమ్మర తనిఖీలు: వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట అనధికారికంగా తీసుకెళ్తున్న రూ.లక్ష నగదును సీజ్ చేశారు. బోయవీధి, సున్నపుగేరు, నీరుగంటివీధి, వేణుగోపాల్‌నగర్‌లలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు.